

కాలనీ మహిళలతో మాట్లాడుతున్న పిపిఎస్ఎస్ నాయకులు ఇ.పుల్లారెడ్డి, ఇతర నాయకులు

## నీటి సమస్యతో తల్లడిల్లుతున్న ప్రజలు

**-20 రోజులుగా నీళ్లు లేవు....!**
**-పిపిఎస్ఎస్ నాయకుల ముందు మహిళల ఆవేదన**

**ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్**

తెల్లవారుజామున 3 గంటలకు లేచి సిబ్బందిని వేడుకున్నా తగినన్ని నీళ్లు వదలడం లేదంటూ మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. 20 రోజులుగా ప్రజలు తాగునీటి సమస్యతో ఇబ్బంది పడుతుంటే.. మున్సిపల్ ఇంజనీర్లు ఏం చేస్తున్నారు? అని మహిళలు అంటున్నారు. ఇదెక్కడో కాదు కల్లూరు రాముడి గుడి సమీప కాలనీలో తగినన్ని తాగునీటిని సరఫరా చేయాలని నగరపాలక సంస్థ సిబ్బందిని వేడుకున్నా.. మా మొర ఆలకించడం లేదంటూ మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం ఉదయం పట్టణ పౌర సంక్షేమ సంఘం ప్రతినిధి బృందం ఆ కాలనీలో పర్యటించింది. స్థానిక మహిళలు వృద్ధులు అనారోగ్యంతో బాధపడుతున్న వారు తాగునీటి సమస్యతో పడుతున్న ఇబ్బందులను విని ప్రతినిధి బృందం సభ్యులు ఆశ్చర్యానికి గురయ్యారు. ఈ సందర్భంగా కాలనీ మహిళా ప్రతినిధులు లక్ష్మమ్మ, ప్రమీలమ్మ, పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు ఇరిగినేని పుల్లారెడ్డి, కాలనీ అసోసియేషన్ నాయకులు డి .కుమార్ మాట్లాడుతూ ఫిర్యాదు ఇచ్చినా స్పందించరని, ఫోన్ చేసినా అధికారులు ఎత్తడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలో ఎప్పుడూ రాని తాగునీటి సమస్య ఇప్పుడే ఎందుకు వచ్చిందని ప్రశ్నించారు. ఇంటి పన్నులు, కొళాయి పన్నులు సక్రమంగా చెల్లిస్తున్నా.. తాగు నీటిని కూడా పేదవాళ్లకు సరఫరా చేయరా.. అని ప్రశ్నించారు. ఈ కాలనీలో తక్కువ స్థలంలో ఎక్కువ పేద ప్రజలు జీవిస్తున్న విషయాన్ని నగరపాలక సంస్థ ఇంజనీర్లు గుర్తించాలన్నారు. కొందరికి ఎక్కువ నీళ్లు వదులుతూ పేద వాళ్లకు తక్కువ నీళ్లు వదులుతూ వివక్షత చూపిస్తున్నారని విమర్శించారు. 20 రోజులుగా తాగునీటి సమస్యతో ప్రజలు ఇబ్బంది పడుతూ ఉంటే మున్సిపల్ ఇంజనీర్లు ఏం చేస్తున్నారని పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు ప్రశ్నించారు. వెంటనే కమిషనర్ జోక్యం చేసుకొని ప్రతిరోజు తాగునీటిని సరఫరా చేయాలని కోరారు. తాగునీటి సమస్య వచ్చినప్పుడు ఆదుకోవడానికి బోరింగులు వేయాలని కోరారు. తాగునీటి సమస్య పరిష్కరించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుటబైఠాయిస్తామన్నారు. ఈ పర్యటనలో కళావతమ్మ, మణమ్మ, కృష్ణవేణి, కె.మధుసూదన్, వై. రామాంజనేయులు పాల్గొన్నారు.

# నిత్య జీవితంలో యోగా ఒక భాగం

**-రాష్ట్రంలో అత్యధికంగా కర్నూలు జిల్లాలో 12.76 లక్షల మంది రిజిస్ట్రేషన్**
**- జిల్లా వ్యాప్తంగా యోగాంధ్ర విజయవంతం - కలెక్టర్ పి.రంజిత్ బాషా**



యోగాసనాలు వేస్తున్న కలెక్టర్, ఎస్పీ, జెసి, కమిషనర్

**ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్**

ఆరోగ్య, సుసంపన్న, ఆనంద ఆంధ్రప్రదేశ్ కోసం రాష్ట్ర ప్రభుత్వం యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించిందని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా పేర్కొన్నారు. శనివారం అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా కర్నూలు నగరంలోని ఔట్‌డోర్ స్టేడియంలో కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా, ఎస్‌పి విక్రాంత్ పాటిల్, జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య, కర్నూలు మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు, జిల్లా అధికారులు, యోగాభ్యాసకులు యోగాసనాలు వేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలందరూ ఆరోగ్యంగా, ఆనందంగా, సంపన్నంగా ఉండాలన్నది ముఖ్యమంత్రి ఉద్దేశ్యమని అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవంలో భాగంగా మన రాష్ట్ర ఒక రికార్డును సృష్టించిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 2 కోట్ల 39 లక్షల మంది రిజిస్ట్రేషన్ చేసుకుంటే అందులో అత్యధికంగా కర్నూలు జిల్లా నుండి 12 లక్షల 76 వేల మందిని రిజిస్ట్రేషన్ చేయగలిగామన్నారు. నెలరోజుల పాటు యోగాంధ్ర కార్యక్రమాలను జిల్లాలో విజయవంతంగా నిర్వహించామని కలెక్టర్ తెలిపారు. విద్యార్థులు, పారిశుధ్య కార్మికులు, ఉద్యోగస్తులు, మహిళలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారన్నారు. దాదాపుగా 5,287 వెన్యూలలో శిక్షణ కార్యక్రమాలను ఇచ్చామన్నారు. జిల్లా, మండల, గ్రామ స్థాయిలో యోగాకు సంబంధించిన పోటీలు నిర్వహించామన్నారు. జిల్లా నుండి రాష్ట్ర స్థాయిలో కూడా పోటీల్లో పాల్గొన్నారని, పోటీల్లో గెలుపొందిన వారికి కలెక్టర్ అభినందనలు తెలిపారు. యోగా మాస్టర్లు ఈ కార్యక్రమం విజయవంతమయ్యేలా కృషి చేశారని కలెక్టర్ అభినందించారు. యోగాను ఆసక్తిగా, ప్రతి ఒక్కరూ నిత్య జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు. యోగా కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్క పౌరుడు సర్టిఫికెట్ను తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. కర్నూలు నగరపాలక సంస్థ కమిషనర్ రవీంద్రబాబు మాట్లాడుతూ మునిసిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, మహిళలు, అధికారులు అందరికీ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం 3వ శనివారం స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణాంధ్రలో భాగంగా ప్రజలతో కలెక్టర్ అందరితో స్వచ్ఛ ప్రతిజ్ఞ చేయించి మొక్కలు అందించారు.



ఆసనాలు వేస్తున్న ట్రైనర్

**కర్నూలు లీగల్** : జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.కబర్ది జిల్లా కోర్టు ఆవరణంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని న్యాయమూర్తులు, కోర్టు సిబ్బందితో నిర్వహించారు.



యోగాలో పాల్గొన్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి కబర్ది

అనునిత్యం ఎదురయ్యే ఆటుపోట్లను అధిగమించడానికి నిజజీవితంలో యోగా అవసరమని, యోగా వల్ల ప్రశాంతతోపాటు ఆరోగ్యానికి మంచిదని సూచించారు. యోగా సాధన వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. న్యాయ శాఖ ఉద్యోగి యోగా మాస్టర్ ముంతాజ్ ద్వారా నిత్యం చేసుకొనే కొన్ని యోగాసనాలు వేయించారు. న్యాయమూర్తులు, బార్ ప్రెసిడెంట్ హరినాథ్ చౌదరి, న్యాయ వాదులు పాల్గొన్నారు.

**కర్నూలు కలెక్టరేట్** : అంతర్జాతీయ యోగా దినోత్సవం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. పలు ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో యోగా విన్యాసాలు నిర్వహించారు. నెల రోజులపాటు యోగా శిక్షణ పూర్తి చేసినటువంటి వారికి యోగాంధ్ర కార్యక్రమం కింద సర్టిఫికెట్లను కూడా మంజూరు చేశారు. రాయలసీమ వర్సిటీలో, క్లస్టర్ యూనివర్సిటీ, ఉర్దూ యూనివర్సిటీలో యోగాసనాలు వేశారు. నగరంలోని రవీంద్ర విద్యాసంస్థల్లో రవీంద్ర విద్యా సంస్థలు, కర్నూలు బి క్యాంప్ ప్రభుత్వ వొకేషనల్ జూనియర్ కళాశాలలో యోగా దినోత్సవం నిర్వహించారు.



అవుట్‌డోర్ స్టేడియంలో యోగాలో పాల్గొన్న అధికారులు, విద్యార్థులు

## నేడు గుండె వైద్య ఉచిత శిబిరం

**ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్**



కర్నూలు నగరంలోని జిఎస్‌టి ఆఫీస్ ఎదురుగా ఎస్‌ఆర్‌పేటలోని, పార్క్ స్క్వేర్ కాంప్లెక్స్ షాప్ నెం. 5 , 6 లోని కార్డియాక్ సెంటర్ ఆధ్వర్యంలో నేడు ఆదివారం 22న ఉచిత గుండె వైద్య శిబిరాన్ని ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1 వరకు నిర్వహిస్తున్నామని ప్రముఖ కార్డియాలజిస్టు డాక్టర్ నాగేంద్ర ప్రసాద్ తోట ప్రజాశక్తితో తెలిపారు. ఈ శిబిరంలో ఇసిజి, షుగర్ టెస్టు, లిపిడ్ ప్రొఫైల్, కన్సల్టేషన్ ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. మరిన్ని వివరాలకు 8142024294, 850074517 సంప్రదించవచ్చునని తెలిపారు.

## పార్కు స్థలాన్ని ఖాళీ చేయాలి

**- అర్హులకు ఇళ్లు మంజూరు చేస్తాం**
**- అన్యాక్రాంతమైన పార్కు స్థలాన్ని పరిశీలించిన జెసి**

**ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్**



స్థలాన్ని పరిశీలిస్తున్న జెసి, కమిషనర్

కల్లూరు అర్బన్ 19వ వార్డు నాల్గవ తరగతి ఉద్యోగుల కాలనీ ఎల్‌పి నెంబర్ 116/89లో అన్యాక్రాంతమైన పార్కు స్థలాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య, నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్ర బాబు, ఆర్‌డిఒ సందీప్‌లు శనివారం పరిశీలించారు. పార్కు స్థలంలో నివాసముంటున్న వారితో మాట్లాడి, వారి సమస్యలు విన్నారు. పార్కు స్థలంలో నివాసాలు ఏర్పాటు చేయడం కోర్టు ఆదేశాలకు విరుద్ధమని, ఖాళీ చేయాలని తెలిపారు. అక్కడ ఉన్న ప్రజల అభ్యర్థన మేరకు గృహాల కోసం దరఖాస్తు చేసుకుంటే అర్హతలు బట్టి మంజూరు చేస్తామని జాయింట్ కలెక్టర్ హామీ ఇచ్చారు. అన్యాక్రాంతమైన పార్కు స్థలంలో ప్రస్తుతం ఉన్న స్థితి గతులను క్షేత్రస్థాయిలో సర్వే చేసి పూర్తి వివరాలతో నివేదిక ఇవ్వాలని రెవెన్యూ, మున్సిపల్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సిటి ప్లానర్ ప్రదీప్ కుమార్, విఆర్‌ఒలు పాల్గొన్నారు.

## సర్పంచి పట్ల బిజెపి ఎమ్మెల్యే వివక్ష

**ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి**

దళిత సర్పంచి పట్ల బిజెపి ఎమ్మెల్యే పార్థసారథి వివక్ష చూపారు. ఆదోని మండలం ఢణాపురం సర్పంచిని వేదికపైకి పిలవకుండా కిందే నిలబెట్టారు. 'కూటమి' నాయకుల సమక్షంలోనే ఈ ఘటన చోటు చేసుకుంది. ఈ నెల 16న ఆదోని మండలం ఢణాపురం గ్రామంలో కూటమి ప్రభుత్వ ఏడాది పాలనపై సంబరాల కార్యక్రమం నిర్వహించారు. ఆదోని బిజెపి ఎమ్మెల్యే పార్థసారథి, రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ మాజీ సభ్యులు గుడిసె ఆది కృష్ణమ్మ, మాజీ సర్పంచి మల్లికార్జున, కూటమి నాయకులు హాజరయ్యారు. స్థానిక దేవాలయం వద్ద ఈ కార్యక్రమం నిర్వహించారు. దేవాలయం కట్టపై ప్రజాప్రతినిధులు ఉండగా స్థానిక సర్పంచి చంద్రశేఖర్ కింద నిలబడ్డారు. సభలో ఎమ్మెల్యే పార్థసారధి సర్పంచిని పైకి రమ్మని పిలిచారు. 'సర్పంచి ఎస్సీ. ఆయన రాకూడదు' అని టిడిపి మాజీ ఇన్‌ఛార్జీ గుడిసె ఆది కృష్ణమ్మ ఎమ్మెల్యే చెవిలో చెప్పారు. దీంతో ఎమ్మెల్యే సర్పంచి చంద్రశేఖర్‌ను కిందనే ఉండాలంటూ చేతితో సైగ చేసి అక్కడే నిలబెట్టారు. గ్రామ ప్రథమ పౌరునిపైనే ఇంత వివక్ష చూపుతుంటే, ఇక సామాన్యుల పరిస్థితి ఏమిటని ప్రజాసంఘాల నాయకులు మండిపడుతున్నారు. దళిత సర్పంచి పట్ల చూపిన వివక్షను నిరసిస్తూ జిల్లా వ్యాప్తంగా ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసనలు చేపట్టారు. ఆదోని ఎమ్మెల్యే, టిడిపి నాయకురాలు గుడిసె ఆది కృష్ణమ్మపై ఎస్సీ, ఎస్టి అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. ఎమ్మెల్యే వీడియో వైరల్ అయిన మరుసటి రోజు బిజెపి ఎమ్మెల్యే కొన్ని దళిత సంఘాలను తన ఇంటికే పిలిపించుకుని విలేకరుల సమావేశం పెట్టి క్షమాపణలు చెప్పారు.

**భద్రత లేని బడి బస్సులు :** విద్యార్థుల రవాణా కోసం వినియోగించే బస్సుల్లో అనుసరించాల్సిన నియమ నిబంధనలను ప్రయివేటు పాఠశాలలు గాలికి వదిలేస్తున్నాయి. ప్రైవేటు విద్యా సంస్థల బస్సులను ప్రతి ఏడాది వాటి సామర్థ్యాన్ని నిర్ధారించుకునేందుకు ఆర్‌టిఒ ఆఫీసులో ఎంవిఐ ద్వారా ఫిట్నెస్ సర్టిఫికెట్‌ను పొందాల్సి ఉంది. ఈ పరీక్షల్లో ఎంవిఐ బస్సును పూర్తిగా పరిశీలించి నిబంధనలకనుగుణంగా అన్ని సక్రమంగా ఉన్నాయ ని నిర్ధారించాకే ఫిట్నెస్ సర్టిఫికెట్‌ను అందజేస్తారు. అప్పుడే ఆ బస్సు రోడ్డుపై తిరగాల్సి ఉంటుంది. అలా కాకుండా దాదాపు 30 శాతం బస్సులు ఫిట్‌నెస్ లేకుండానే బడి పిల్లలను తరలిస్తున్నాయి. ఫిట్నెస్ సర్టిఫికెట్ పొందడానికి మే 15వ తేదీని ప్రతి ఏడాది చివరి గడువుగా రవాణా శాఖ నిర్ణయించింది. జూన్ మాసం పూర్తయినా ఫిట్నెస్ సర్టిఫికెట్లు విద్యాసంస్థల యాజమాన్యాలు పొందకపోవడం పట్ల తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనను వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల బస్సులు తప్పనిసరిగా పసుపు రంగులో ఉండాలి. బస్సు ముందు, వెనుక, ఎడమ వైపు పాఠశాల పేరు, చిరునామా, ఫోన్ నంబర్లు స్పష్టంగా కనిపించేలా రాయాలి. బస్సు సీటింగ్ సామర్థ్యానికి మించి విద్యార్థులను ఎక్కించరాదు. ప్రతి విద్యార్థికి సీటు ఉండాలి. చిన్నారులు సులువుగా ఎక్కి, దిగేందుకు వీలుగా బస్సు మెట్లు ఉండాలి. మెట్లు 325 మిల్లీ మీటర్ల ఎత్తుకు మించకూడదు. పట్టుకోవడానికి రెయిలింగ్ రాడ్ ఉండాలి. బస్సు లోపల, బయట ఇరువైపులా సైడ్ అద్దాలు అమర్చాలి. డ్రైవర్ విద్యార్థులను వెనుక నుంచి వస్తున్న వాహనాలను గమనించడానికి అవి ఉపయోగపడతాయి. లోపల డ్రైవర్‌కు కనిపించే విధంగా పెద్ద పారదర్శక అద్దం ఉండాలి. విద్యార్థులు కిటికీల నుంచి చేతులు బయటకు పెట్టకుండా కిటికీలకు ఇనుప గ్రిల్స్ ఏర్పాటు చేయాలి. బస్సుకు అత్యవసర ద్వారం తప్పనిసరిగా ఉండాలి. అది సులభంగా తెరుచుకునేలా ఉండాలి. దానిపై 'అత్యవసర ద్వారం' అని స్పష్టంగా రాయాలి. అనుకోని ప్రమాదాలు సంభవించినప్పుడు మంటలను ఆర్పేందుకు ఫైర్ ఎస్టింగిషర్లు బస్సులో అందుబాటులో ఉండాలి. బస్సులో ప్రథమ చికిత్స పెట్టె తప్పనిసరిగా ఉండాలి. అందులో అవసరమైన పరికరాలు మందులు ఉండాలి. బస్సులోని సీట్ల మధ్య ఖాళీ ప్రదేశంలో, విద్యార్థులు నడిచే వైపు కాళ్లకు దెబ్బలు తగలకుండా కింది భాగంలో మ్యాట్ ఉండాలి. విద్యార్థులు తమ బ్యాగులు పెట్టుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు ఉండాలి. బస్సుల డోర్లు సురక్షిత లాకింగ్ సిస్టమ్ తో అమర్చాలి. బస్సుకు సంబంధించి బ్యాటరీ, వైపర్స్, రెండువైపులా ఇండికేటర్లు పనిచేసేలా చూసుకోవాలి. బస్సులో 60 సంవత్సరాలు పైబడిన వ్యక్తిని డ్రైవర్‌గా ఉపయోగించరాదు. డ్రైవర్‌కు కనీసం ఐదు ఏళ్ళు అనుభవం తప్పనిసరి ఉండాలి. ప్రతి మూడు నెలలకోసారి డ్రైవర్‌కు యాజమాన్యం ఆరోగ్య, కంటి పరీక్షలు చేయించాలి. డ్రైవర్ తో సహా ఒక అటెండరు బస్సులో ఉండాలి. వీటిలో చాలా నిబంధనలను ప్రయివేటు బడి బస్సుల్లో పాటించడం లేదు. దీంతో విద్యార్థుల ప్రాణాలకు భద్రత లేకుండా పోయింది.






## విద్యార్థులకు కలుషిత నీరే గతి

**చెడిపోయిన ఆర్వో ప్లాంట్**

**ప్రజాశక్తి-పత్తికొండ**


కలుషిత నీరు తాగి అనారోగ్యాలకు గురవుతున్నామని విద్యార్థులు ఆవేదన చెందుతున్న సంఘటన పత్తికొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చోటుచేసుకుంది. వైసిపి ప్రభుత్వంలో నాడు - నేడు పథకం ద్వారా విద్యార్థుల కోసం రూ.కోట్లు వెచ్చించి ప్రభుత్వ పాఠశాలలకు ఆర్వో ప్లాంట్లను పంపిణీ చేసింది. దానిని మేంటనెన్స్ చేయనందున, ప్రధానోపాధ్యాయులు నిర్లక్ష్యంతో ఆర్వో ప్లాంట్ చెడిపోయి తుప్పు పట్టిందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కలుషితనీరు తాగి జ్వరం, టైఫాయిడ్, మలేరియా జ్వరాలతో ఇబ్బందులు పడుతున్నామని అన్నారు.ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడంలేదని హెచ్‌ఎంపై విద్యార్థులు మండిపడ్డారు. మెనూ ప్రకారం భోజనం పెట్టడం లేదని తెలిపారు. యోగాంధ్ర సందర్భంగా సన్నబియ్యంకు బదులుగా రేషన్ బియ్యంతో భోజనం ఏర్పాటు చేశారని విద్యార్థులు తెలిపారు. ఈ విషయంపై హెచ్‌ఎం మాలతిని వివరణ కోరగా రేషన్ బియ్యం స్టాక్ ఉండడం వల్ల విద్యార్థులకు భోజనం ఏర్పాటు చేశామని తెలిపారు. సుమారు 850 మంది విద్యార్థులు ఉండడంతో ఆర్వో ప్లాంట్ ద్వారా విద్యార్థులకు మినరల్ వాటర్ సరఫరా చేయలేమని, బోరు నీరు సరఫరా చేస్తున్నామని తెలిపారు. ఇప్పటికైనా జిల్లా విద్యాశాఖ అధికారులు స్పందించి ఆర్వో ప్లాంట్ ను వినియోగంలోకి తీసుకురావాలని విద్యార్థులు కోరారు.



రేషన్ బియ్యంతో వండిన అన్నం

## క్రిష్ణగిరి ఎస్ఐగా జి.కృష్ణమూర్తి

**ప్రజాశక్తి-క్రిష్ణగిరి**



క్రిష్ణగిరి పోలీసుస్టేషన్ ఎస్ఐగా జి.కృష్ణమూర్తి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తామన్నారు. అసాంఘిక కార్యక్రమాలు, జూదం, అక్రమ మద్యం తదితర వాటిపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. వివిధ కేసుల విషయంలో పోలీస్ స్టేషన్ కు వచ్చిన బాధితులకు న్యాయం జరుగుతుందన్న నమ్మకాన్ని కల్పించేలా తాము పని చేస్తామని స్పష్టం చేశారు. పోలీసు సిబ్బంది నూతన ఎస్ఐకి శుభాకాంక్షలు తెలిపారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఐ కె.మల్లికార్జున కర్నూలు 3 టౌన్ పోలీసుస్టేషన్ కు బదిలీపై వెళ్ళారు.

# సిల్వర్ సెట్ ఫలితాలు విడుదల

**ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్**




సిల్వర్‌సెట్ ఫలితాలను విడుదల చేస్తున్న ఇన్‌ఛార్జి విసి వి.వెంకటబసవరావు, రిజిస్ట్రార్, అధ్యాపకులు

ఉమ్మడి రాష్ట్రంలో ఎంతో ప్రతిష్టాత్మకమైన సిల్వర్ సెట్ ఫలితాలను శనివారం, క్లస్టర్ యూని వర్సిటీ ఇంచార్జ్ విసి వి.వెంకట బసవరావు, రిజిస్ట్రార్ డాక్టర్ కట్టా వెంకటేశ్వర్లు విడుదల చేశారు. అనంతరం విసి మాట్లాడుతూ సిల్వర్ సెట్ పోటీ పరీక్షకు వేలమంది విద్యార్థులు పోటీ పడేవారని ఇక్కడ చదివిన విద్యా ర్థులు ఎంతోమంది ఉన్నత శిఖరాలు అధిరోహించారని గుర్తు చేశారు. సిల్వర్‌సెట్ కు అర్హత సాధించిన విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుంద న్నారు. రిజిస్ట్రార్ డాక్టర్ కట్టా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మే29న సిల్వర్‌సెట్ పరీక్ష నిర్వహించామన్నారు. సిల్వర్ సెట్ పరీక్షకు 1196 మంది విద్యార్థులు హాజరు కాగా దాంట్లో 1085 మంది విద్యార్థులు సెట్ అర్హత సాధించారని తెలిపారు. బిఏలో మొదటి ర్యాంక్ ఈపూరు సుస్మిత, బీకాంలో మొదటి ర్యాంకు జి.మానస, బిఎస్సీ మ్యాథమెటిక్స్‌లో మొదటి ర్యాంకు పి. చిరుహాసిని, బిఎస్‌సి లైఫ్ సైన్స్‌లో మొదటి ర్యాంకు షేక్ హమ్నా లేహర్‌లు మొదటి ర్యాంకులు సాధించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిల్వర్ జూబ్లీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి. శ్రీనివాస్, ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఇందిరా శాంతి, కెవిఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.వెంకటరెడ్డి, సిల్వర్ సెట్ కన్వీనర్ డాక్టర్ మహమ్మద్ వాహీద్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ప్రసాద్ రెడ్డి, క్లస్టర్ యూనివర్సిటీ ఎగ్జామి నేషన్స్ డీన్ డాక్టర్ నాగరాజ్ శెట్టి, కంట్రోలర్ డాక్టర్ బాల సుబ్రహ్మణ్యం, డీన్ డాక్టర్ అక్తర్ భాను, అధ్యాపకులు ఎల్లాకృష్ణ, డి. శ్రీనివాస్ లు పాల్గొన్నారు.

# ప్లాస్టిక్‌ను నిషేదించి పర్యావరణాన్ని కాపాడుదాం

**డిఎంహెచ్‌ఒ ఆఫీసులో మొక్కలు నాటిన వైద్యులు**

**ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్**

ప్లాస్టిక్‌ను నిషేదిద్దాం.. పర్యావరణాన్ని పరిరక్షిద్దాం... పచ్చదనాన్ని పెంపోదిద్దాం' అని డిఎంహెచ్‌ఒ డాక్టర్ శాంతికళ సూచించారు. జిల్లా వైద్య , ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో 'స్వర్ణాంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమంలో భాగంగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి పర్యావరణాన్ని కాపాడుతామని ప్రతిజ్ఞ చేశారు. జిల్లా వైద్య . ఆరోగ్య శాఖాదికారి డాక్టర్ శాంతికళ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా ప్రతి నెలా మూడవ శనివారాన్ని "స్వచ్ఛత దివస్" గా పరిగణిస్తూ ప్రతిజ్ఞ , అవగాహన ర్యాలి నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాలు , హెల్త్ అండ్ వేల్నేస్స్ సెంటర్లలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా ప్లాస్టిక్‌ను నిషేదిద్దాం పర్యావరణాన్ని పరిరక్షిద్దాం , పచ్చదనాన్ని పెంపోదిద్దాం అని పిలుపునిచ్చారు. అంతేకాకుండా ఈ విషయాలపై ప్రజలకు ఆరోగ్య సిబ్బందితో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తదుపరి ప్రోగ్రాం అధికారులు, కార్యాలయ సిబ్బంది కలిసి స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ పరిపాలన అధికారిణి అరుణ, జిల్లా వ్యాదినిరోదక టీకాల అధికారి డాక్టర్ నాగప్రకాష్ , డిపిఎంఒ డాక్టర్ ఉమా, పిఒ ఆర్ బి ఎస్ కె డాక్టర్ మహేశ్వర ప్రసాద్ , డెమో శ్రీనివాసులు శెట్టి , ఎస్‌ఒ. హేమసుందరం , డిపిహెచ్ఎన్ఒ అన్నపూర్ణమ్మ, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.




**జిజిహెచ్, మెడికల్ కాలేజీలో మొక్కలు నాటిన అధికారులు**

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ఆసుపత్రి ఆవరణలోని సదరం క్యాంప్ దగ్గర మొక్కలు నాటారు. వైద్య సిబ్బందితో ప్రతిజ్ఞ చేసిన అనంతరం స్వచ్ఛ ఆస్పత్రి కోసం ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిని అగ్రస్థానంలో నిలిపేందుకు ప్రతి ఒక్క వైద్య సిబ్బంది కృషి చేయాలన్నారు. ఆసుపత్రి ఆవరణలో ప్రతి ఒక్కరు అంకిత భావంతో పని చేయాలని వారికి సూచించినట్లు తెలిపారు. అంతకంటే ముందు హాస్పిటల్ ఆవరణలో అంతర్జాతీయ యోగాడే సందర్భంగా వైద్యులు సిబ్బందితో యోగాసనాలు వేయించారు. కర్నూలు మెడికల్ కాలేజీలో కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ చిట్టి నరసమ్మ ఆధ్వర్యంలో పరిసరాలను పరిశుభ్రపరిచి మొక్కలు నాటారు. విద్యార్థులచే స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. అంతకంటే ముందు కాలేజీలోని ఎగ్జామినేషన్ సెంటర్ నందు అంతర్జాతీయ యోగా డే సందర్భంగా వైద్యులు, విద్యార్థులు యోగాసనాలు వేశారు.



మొక్కలు నాటిన ప్రిన్సిపల్ డాక్టర్ చిట్టినరసమ్మ



ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జెండాను ఎగురవేసి మాట్లాడుతున్న నాయకులు

## విద్య కార్పొరేటీకరణ, కాషాయికరణ


**కూటమి ప్రభుత్వంపై ఎస్‌ఎఫ్ఐ విమర్శ**

**ప్రజాశక్తి- కర్నూలు కార్పొరేషన్**

కూటమి ప్రభుత్వం విద్యను కార్పొరేటీకరణ, కాషాయీ కరణ, కేంద్రీకరణ వైపు నడిపిస్తూ సామాన్యునికి అందని ద్రాక్షలా చేస్తుందని ఎస్‌ఎఫ్ఐ నగర కమిటీ విమర్శించింది. ఎస్‌ఎఫ్ఐ కర్నూలు నగర కమిటీ ఆధ్వర్యంలో అఖిలభారత మహాసభల సందర్భంగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద జెండా ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్ఐ కర్నూలు నగర ఉపాధ్యక్షుడు ఆర్యన్, నగర సహాయ కార్యదర్శి పృథ్వి, ఆదిత్య మాట్లాడుతూ విద్య సామాన్యునికి అందని ద్రాక్షాగా మారిందన్నారు. ప్రస్తుతం సమాజంలో ఎన్ని అసమానతలు అంతరాలు ఉన్నాయో అన్నింటిని నేటి విద్యారంగం కళ్ళకు కట్టినట్టు చూపిస్తూ విద్యపై ప్రభుత్వాలు తమ భాధ్యతను మరిచి కార్పోరేట్లకు రెడ్ కార్పెట్ పరుస్తున్నాయన్నారు. ప్రభుత్వ విద్యపై సవతి తల్లి ప్రేమను కురిపిస్తున్నారన్నారు. విద్యా రంగంలో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన జాతీయ విద్యా విధానంతో కార్పోరేటీకరణ, కషాయికరణ, కేంద్రీకరణ దిశగా అడుగులు వేస్తున్నదన్నారు. స్వాతంత్ర సమరయోధులు మహా నాయకులు, దేశభక్తుల చరిత్రను వక్రీకరిస్తున్నారు. సోషలిజం, లౌకికవాదం అంశాలను రాజ్యాంగం నుండి తొలగించే ప్రయత్నం చేస్తున్నారు. విద్యారంగాన్ని కాపాడుకోవడానికి నిరంతరం పోరాటాలకు ఈ మహాసభల్లో చర్చిస్తామన్నారు.

## నేడు ఉచిత మెగా వైద్య శిబిరం

**డాక్టర్ మోహన్స్ డయాబెటిస్ సెంటర్**



**ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్** : దేశంలోనే ప్రముఖ డయాబెటిస్ చికిత్స కేంద్రాల్లో ఒకటైన డాక్టర్ మోహన్స్ డయాబెటిస్ సెంటర్ కర్నూలు లోని బుధవారపేట బ్రాంచ్ వద్ద ఈనెల 22న ఆదివారం ఉచిత మెగా ఆరోగ్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు బ్రాంచ్ మేనేజర్ నరసింహులు తెలిపారు. ఉదయం 7:00 గంటల నుండి మధ్యాహ్నం 3:30 వరకు ఈ శిబిరం నిర్వహించనున్నారు. నరసింహులు మాట్లాడుతూ, 'మధుమేహం వ్యాధిగ్రస్తులకు అవసరమైన పాథోలాజికల్, స్క్రీనింగ్, స్పెషల్ టెస్టు లను ఉచితంగా అందించడమే మా లక్ష్యం. ఆరోగ్య అవగాహన పెంచేందుకు ప్రతి ఒక్కరూ ఈ శిబిరాన్ని వినియోగించుకోవాన్నారు.

**శిబిరంలో అందించే ముఖ్య సేవలు:** డాక్టర్ సంప్రదింపులు,యూరిన్, బ్లడ్‌షుగర్ టెస్టులు (ఫాస్టింగ్,పోస్ట్ ప్రాండియల్), హెచ్‌బి ఎ 1 సి , బిపి, బిఎంఐ టెస్టులు, ఇసిజి, లిపిడ్‌ప్రొఫైల్, కిడ్నీ, లివర్, ఫంక్షన్ టెస్టులు, కంటి పరీక్షలు, న్యూరాలజికల్ పరీక్షలు, ఫుట్ స్క్రీనింగ్, సీజీమ్ టెస్టులు (2-3 గంటల పాటు గ్లూకోజ్ మానిటరింగ్) ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకునే వారికి ప్రత్యేకంగా 15శాతం డిస్కౌంట్ లభిస్తుంది. పైగా రూ.3000 విలువ గల ఫ్రీ స్టాండర్డ్ హెల్త్ చెకప్ కూడా అందిస్తామని తెలిపారు. ఇతర వివరాలకు 87909 00508 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

# అనర్హులకు చోటు..!

**- కోగిలతోట సబ్ స్టేషన్‌లో మరో నకిలీ సర్టిఫికెట్ - నష్టపోతున్న నిరుద్యోగులు**

**ప్రజాశక్తి - ఆలూరు**

హొళగుంద మండలం కోగిలతోట 33/11కెవి సబ్ స్టేషన్‌లో అనర్హులకు చోటు దక్కింది. ఆపరేటర్ల నియామకాల్లో అధికారులు, కాంట్రాక్టర్ కాసులకు కక్కుర్తి పడి నకిలీ సర్టిఫికెట్ అభ్యర్థులను తీసుకోవడంతో అర్హులైన నిరుద్యోగులు నష్టపోతున్నారు. కోగిలతోట సబ్ స్టేషన్‌ను ఫిబ్రవరి 17, 2024న ప్రారంభించారు. నాలుగు ఆపరేటర్ పోస్టులను ఎలాంటి నోటిఫికేషన్ ఇవ్వకుండానే భర్తీ చేశారు. నియామకాలు చేపట్టిన వారిలో కూడా ఇద్దరివి నకిలీ ఐటిఐ ఎలక్ట్రీషియన్ సర్టిఫికెట్, మరొకరిది ఐటిఐ ఫిట్టర్ సర్టిఫికెట్ ఉందని ప్రజాశక్తిలో కథనాలు వచ్చాయి. దీంతో అధికారులు సర్టిఫికెట్లను నిజ నిర్ధారణ చేసి ముగ్గురిని తొలగించారు. కాంట్రాక్టర్ స్పష్టత లేని నోటిఫికేషన్‌ను ఫిబ్రవరి 21, 2025న ఇవ్వగా దరఖాస్తు గడువు తేదీ 27తో ముగిసింది. మరుసటి రోజే 28న అప్పటికే శిక్షణలో ఉన్నవారిని నియమించారు. వీరిలో కూడా ఒకరిది నకిలీ సర్టిఫికెట్ ఉన్నట్లు తేలిందని అధికారులు చెబుతున్నారు. నకిలీ సర్టిఫికెట్లతో ప్రభుత్వాన్ని మోసం చేసి ఏడాది పాటు జీతాలు తీసుకుని ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టారు. వీరిపై చర్యలు తీసుకుని.. కాసులకు కక్కుర్తి పడి నిబంధనలకు విరుద్ధంగా నియామకాలు చేపట్టిన అధికారులు, కాంట్రాక్టర్లపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ప్రజాసంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.



కోగిలతోట విద్యుత్ సబ్ స్టేషన్

**నకిలీ సర్టిఫికెట్ అని తేలింది : ఆదోని విద్యుత్ ఇఇ పురుషోత్తం**

కోగిలతోట సబ్‌స్టేషన్‌లో నోటిఫికేషన్ తర్వాత నియామకమైన ఆపరేటర్లలో ఒకరిది నకిలీ సర్టిఫికెట్ అని విజయవాడ డైరెక్టర్ ఎంప్లాయిమెంట్ అండ్ ట్రైనింగ్ వారు నిర్ధారణ చేశారు. మరో ఇద్దరి సర్టిఫికెట్లు నిజ నిర్ధారణ కావాల్సి ఉంది.

# ఆగని రేషన్ మాఫియా..!

**- కూటమి నాయకుల దందా... - పట్టుకుంది 1,800 బస్తాలు.. చూపింది 109**

**ప్రజాశక్తి - ఆదోని**

ఆదోని నియోజకవర్గంలో కూటమి, వైసిపి నేతల వైఖరి ఒకటే. దొందూ దొందే అన్న రీతిలో ఉంది. తాము అధికారంలోకి వస్తే దౌర్జన్యాలు ఉండవని.. భూమాఫియా ఉండదని.. రేషన్ మాఫియా ఉండదని ఎన్నికల నేపథ్యంలో కూటమి నాయకులు ప్రగల్భాలు పలికారు. ఆచరణలో మాత్రం మరచి సంపాదనే ధ్యేయంగా ముందుకు సాగుతున్నారు..



గోదామును సీజ్ చేస్తున్న రెవెన్యూ అధికారులు (ఫైల్)

**మారని తీరు.. కొనసాగుతున్న రేషన్ మాఫియా..**

గతంలో వైసిపి నేతలు రేషన్ మాఫియా కొనసాగించారు, తామేమీ తక్కువ కాదంటూ అధికార పార్టీ నాయకులు అందులో కొందరు దందాకు దిగారు. కూటమి వచ్చిన ఏడాదిలో అక్రమాలకు తెర లేపారు. కొత్త కొత్త విధానాలతో అక్రమాలు చేసి అందినకాడికి ఆర్జిస్తున్నారు. ఆధార్ మార్పులతో రిజిస్టర్ చేయించడం, చనిపోయిన వ్యక్తి భూములు కొట్టేయడం, రాత్రికి రాత్రి పేదల బియ్యాన్ని మాయం చేయడం.. ప్రజలను తప్పుదోవ పట్టించే వైఖరి అవలంభిస్తున్నారు. గోదాములో అక్రమంగా ప్రజా పంపిణీ రేషన్ బియ్యం నిల్వ ఉందని ఇచ్చిన సమాచారం మేరకు సివిల్ సప్లయి డైరెక్టర్ మహేష్ నాయుడు తనిఖీ చేశారు. పట్టణ శివారులోని ఓ గోదాములో దాచి ఉంచిన వందలాది బస్తాల బియ్యాన్ని పట్టుకున్నారు. ఎక్కడపోయి వచ్చి ఇరుక్కుపోయినట్లు అయింది అధికార పార్టీ డైరెక్టర్ పరిస్థితి. ప్రత్యర్థులను ఇరికించాలని వచ్చి ఇంటి దొంగలు దొరకడం చేస్తున్న ఘన కార్యాలను చూసి గుటకలు మింగాల్సి వచ్చింది. స్వామి భక్తిని చాటుకోవడం వదిలిన ఆ డైరెక్టర్ తన స్వామే దొడ్డిదారి అక్రమ వ్యాపారాలు చేయిస్తున్నారని తెలిసి గుండెలు బాదుకున్నారు. ఇక చేసేది లేక ప్రత్యర్థి వైసిపిపై బురద జల్లి మెల్లగా జారుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇక ఆదోని బియ్యం మాయగాళ్లతో చేతులు కలిపిన రెవెన్యూ యంత్రాంగం కాగితాల్లో కాకి లెక్కలు చూపి సరి చేశారు. కళ్లారా చూశారు. ఆయనతో పాటు ఒక వీఆర్ఓ, ఇద్దరు పోలీసులు ఉన్నారు. పేదలకు పంపిణీ చేయాల్సిన వందలాది బస్తాల రేషన్ బియ్యం ఓ గోదాములో నిలువ ఉంచడాన్ని అక్రమమని ఆయనే స్వయంగా ప్రకటించారు.

ఈ అక్రమ వ్యాపారం వెనుక వైసిపి నేతల హస్తముందని, మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి చేయిస్తున్నాడని నోరు పారేసుకున్నారు. తనిఖీ సమయంలో సుమారు 50 కిలోల 1,800 బస్తాలు సమాచారం.. తెల్లారే సరికి ఆ గోదాములో ఉన్న బియ్యాన్ని మాయ చేసి ఉదయం కల్లా కేవలం 109 బస్తాలున్నట్లు రెవెన్యూ అధికారులు తేల్చేశారు. ఈ చీకటి వ్యాపారం వెనక ఎవరు ఉన్నారో తెలియని డైరెక్టర్ మహేష్ నాయుడు అసలు నిజం తెలుసుకుని నిర్ఘాంత పోయారు. స్వామి భక్తి చాటాలని వచ్చి చతికిల పడ్డామని తేరుకున్నారు. ఇది కూటమిలోని ఇంటి దొంగల పని అని తెలుసుకుని అధికారులకు అప్పజెప్పి మెల్లగా అక్కడి నుంచి జారుకున్నారని ఆయన వ్యవహారం పట్ల పలు విమర్శలు వచ్చాయి. ఆదోని పట్టణంలో అక్రమ వ్యాపారాలు, అవినీతి కార్యక్రమాలు ఎవరు చేస్తున్నారో ఏ పార్టీ నేతలు కొనసాగిస్తున్నారో అందరికీ తెలుసు. పేదల బియ్యం వ్యవహారం దృష్టికి ఇంకా తమకు రాలేదని వైసిపి మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి తేల్చి చెప్పారు. ఇలా అడ్డుపెట్టుకొని దోచుకుంటున్న వారే దొంగ దొంగ అని నీతి మాటలు వల్లిస్తున్నారని మండిపడ్డారు. నీతి, నిజాయితీ, ధైర్యం ఉంటే కూటమి నేతలు చేస్తున్న బియ్యం మాఫియాను అరికట్టాలని డిమాండ్ చేశారు. ఇప్పటికీ రేషన్ మాఫియా తీరు మారకుండా కార్డుదారుల నుంచి బియ్యం సేకరించి అక్రమ రవాణాకు పాల్పడుతున్నారు. తమ పార్టీ అధికారంలో ఉందని, ఇది తమ జీవనభృతి అంటూ కొందరు బహిరంగంగా చెబుతున్నారు. ఇంత తతంగం జరుగుతున్నా సంబంధిత అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడం నామమాత్రంగా కేసు నమోదు చేయడం పట్ల విమర్శలు తలెత్తుతున్నాయి.



బొలెరో వాహనంలో తరలిస్తున్న బియ్యం

## రేషన్ బియ్యం అక్రమ తరలింపు

**- కేంద్రంగా మారిన పి.కోటకొండ**

**ప్రజాశక్తి- దేవనకొండ**

దేవనకొండ మండలంలో రేషన్ బియ్యం అక్రమంగా తరలిపోతోంది. బియ్యం తరలింపు కేంద్రంగా పి.కోటకొండ మారింది. పేదలకు ఆహార భద్రత కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రేషన్ షాపుల ద్వారా ప్రతినెలా కార్డుదారులకు బియ్యం పంపిణీ చేస్తోంది. మండలంలోని రేషన్ డీలర్లు గోడౌన్ నుంచి సరఫరా అవుతున్న సంచుల్లో బియ్యం తక్కువగా వస్తోందని చెప్పి కార్డుదారులకు బియ్యం వేసేటప్పుడు డబ్బాల్లో తూకాలు వేసి అక్కడ మిగిలిన బియ్యాన్ని, కార్డుదారుల నుంచి బియ్యాన్ని వ్యాపారులు కొనుగోలు చేసి అక్రమంగా విక్రయిస్తూ, కిరాణ దుకాణాలకు సరఫరా చేస్తున్నారు. రేషన్ మాఫియాలు యథేచ్ఛగా కొనసాగిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ వ్యాపారాన్ని నియంత్రించాల్సిన సంబంధిత శాఖ అధికారులు చేతివాటం, మామూళ్ల మత్తులో తూగుతూ పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న వారిపై సంబంధిత శాఖ ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. డీలర్లు కార్డుదారులకు అందించే రేషన్ బియ్యం డబ్బాల్లో తూకాలు వేయకుండా సక్రమంగా పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని కార్డుదారులు, స్థానికులు కోరుతున్నారు.



ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న తహశీల్దార్

## ఎమ్మెల్యేను కలిసిన తహశీల్దార్

**ప్రజాశక్తి - మంత్రాలయం**

ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డిని తహశీల్దార్ కె.రమాదేవి మర్యాద పూర్వకంగా కలిశారు. శనివారం ఎమ్మెల్యే స్వగ్రామమైన రాంపురంలో ఆయనను కలిసి శాలువా, పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. తుగ్గలి తహశీల్దార్‌గా పని చేసిన కె.రమాదేవి ఇటీవల జిల్లాలో జరిగిన తహశీల్దార్ల బదిలీల్లో భాగంగా సోమవారం మంత్రాలయం తహశీల్దార్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలిశారు. ప్రజా సమస్యలను, రైతుల భూ సమస్యలను త్వరగా పరిష్కరించాలని ఆమెకు ఎమ్మెల్యే సూచించారు. వైసిపి మండల అధ్యక్షులు జి.భీమారెడ్డి, రెవెన్యూ శాఖ సీనియర్ అసిస్టెంట్ జయరామిరెడ్డి ఉన్నారు.

**హంద్రీనీవా కుడి కాలువలో**

## ముళ్లకంపల తొలగింపు

**ప్రజాశక్తి- దేవనకొండ**

హంద్రీనీవా కుడి కాలువలో ముళ్లకంపల తొలగింపును టిడిపి మండల కన్వీనర్ విజయభాస్కర్ గౌడ్ ఆధ్వర్యంలో శనివారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కాలువలో నీటి ప్రవాహానికి ముళ్లకంపలు అడ్డుగా ఉన్నాయని, తొలగించాలని గత 15 రోజుల క్రితం పత్తికొండ ఎమ్మెల్యే కెఇ.శ్యాంబాబు దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఆయన స్పందించి జంగిల్ క్లియరెన్స్ చేయడానికి సంబంధిత శాఖాధికారులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించినట్లు తెలిపారు. స్పందించిన అధికారులు వెంటనే ప్రతిపాదన సిద్ధం చేసి ముళ్లపొదలను తొలగించేందుకు నిధులు మంజూరు చేయడంతో పనులు ప్రారంభించామని తెలిపారు. ముళ్లకంపల తొలగింపునకు నిధులు మంజూరు చేయడంతో ఎమ్మెల్యే శ్యాంబాబుకు టిడిపి నాయకులు, రైతులు కృతజ్ఞతలు తెలిపారు. మండలంలో పిల్ల కాలువలు పూర్తి చేసి 46 వేల ఎకరాలకు సాగునీరు అందించాలని రూ.200 కోట్లతో ప్రతిపాదనలు పంపామని హెచ్ఎన్ఎస్ఎస్ఈఈ గుణకర్ రెడ్డి తెలియజేశారని అన్నారు. నేలతలమర్రి సర్పంచి నాగరాజు గౌడ్ పాల్గొన్నారు.



ముళ్ల కుంప తొలగింపులో విజయ భాస్కర్ గౌడ్

# యోగాతో శారీరక, మానసిక ఆరోగ్యం

**- సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్**

**ప్రజాశక్తి - ఆదోని**

యోగా చేయడం వల్ల శారీరక, మానసిక ఆరోగ్యం పెంపొందుతుందని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ తెలిపారు. శనివారం పట్టణంలోని మున్సిపల్ మైదానంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ కృష్ణ ఆధ్వర్యంలో యోగాసనాలు వేశారు. ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ హాజరై ఆసనాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నెల రోజులపాటు యోగా గురించి అవగాహన కల్పిస్తూ స్వచ్ఛందంగా ముందుకొచ్చేలా ఉద్యోగులు కృషి చేశారని తెలిపారు. మున్సిపల్ ఛైర్మన్ లోకేశ్వరి, ఎంఇఒ శిరీష దీప్తి, ఇరిగేషన్ డిప్యూటీ ఇంజినీర్ షఫీవుల్లా, డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ సత్యవతి ఉన్నారు. అలాగే పట్టణంలోని లేబర్ కాలనీ మున్సిపల్ హై స్కూల్ ఆవరణలో మొక్కలు నాటారు. ప్రధానోపాధ్యాయులు రవి మాట్లాడారు. ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు పెంచి వాటిని సంరక్షించే బాధ్యత చిన్నారులకు అప్పగించాలని తల్లిదండ్రులకు సూచించారు. అనంతరం యోగాసనాలు వేయించారు. అలాగే పట్టణంలోని బీరప్ప కాలనీలో ఉన్న మహా వీర్ పార్కులో కౌన్సిలర్ సందీప్ రెడ్డి ఆధ్వర్యంలో యోగాసనాలు వేయించారు. మున్సిపల్ కమిషనర్ కృష్ణను శాలువాతో సన్మానించారు. **ఎమ్మిగనూరు** పట్టణంలోని ప్రభుత్వ బాలుర మైదానంలో జరిగిన ఎమ్మెల్యే బీవీ.జయ నాగేశ్వర రెడ్డి యోగాలో పాల్గొన్నారు. అనంతరం మొక్కలు నాటారు. ప్రత్యేకాధికారి, డిఆర్‌డిఎ పీడీ రమణా రెడ్డి, మున్సిపల్ కమిషనర్ ఎన్.గంగిరెడ్డి, సిఐ శ్రీనివాసులు పాల్గొన్నారు. **మంత్రాలయం** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అనురాధ మాట్లాడారు. ప్రస్తుత పరిస్థితుల్లో మానవాళికి యోగా అవసరమని తెలిపారు. అనంతరం యోగా ఇన్‌స్పెక్టర్ శ్రీకృష్ణ పరబ్రహ్మ ఆధ్వర్యంలో యోగాసనాలను వేయించారు. ఎంపిడిఒ నూర్జహాన్, తహశీల్దార్ రమాదేవి, సిఐ రామానుజులు, జనసేన ఇన్‌ఛార్జీ బి.లక్ష్మన్న, వైద్యాధికారి గోవిందమ్మ, ప్రధానోపాధ్యాయులు అంపయ్య, ఉపాధ్యాయులు నరసింహులు పాల్గొన్నారు. **దేవనకొండ** ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించారు. జిల్లా టూరిజం శాఖ అధికారి విజయ పాల్గొన్నారు. జిల్లేడు బుడకల గ్రామంలో రాష్ట్ర వాల్మీకి ఫెడరేషన్ ఛైర్మన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ, మాజీ ఎంపిపి రామచంద్ర నాయుడు పాల్గొన్నారు. ఎంపిడిఒ రమణారావు, తహశీల్దార్ రామాంజనేయులు, సిఐ వంశీనాథ్, ఎంఇఒలు తిమ్మారెడ్డి, విజయనిర్మల, కస్తూరిబా పాఠశాల ప్రిన్సిపల్ సునీత పాల్గొన్నారు. **కోసిగి** మండలం దొడ్డి బెళగల్ గ్రామంలో యోగా డే నిర్వహించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో పంచాయతీ కార్యదర్శి అంజి అధ్యక్షతన ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్ రెడ్డి, ఎంపిపి స్కూల్ ప్రధానోపాధ్యాయులు ఆలీఖాన్ ఆధ్వర్యంలో యోగాసనాలు వేశారు. సర్పంచి మాల పద్మమ్మ భర్త మాల రామయ్య, ఐటిడిపి నియోజకవర్గ అధ్యక్షులు సల్మాన్ రాజు, రాజశేఖర్ రెడ్డి, ఉసేని, పాఠశాల ఛైర్మన్ తిక్కప్ప, అంగన్వాడీ సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి బాయి, విఆర్ఒ రామాంజినేయులు, ఎఎన్ఎం అనిత, ఉపాధ్యాయులు పాండు రంగా, పవన్ కుమార్, సదానందం, ఖాజా, శ్రీలక్ష్మి, లక్ష్మి దేవి పాల్గొన్నారు. **చిప్పగిరి** భోగేశ్వర దేవాలయం దగ్గర మండల అధికారుల ఆధ్వర్యంలో మండల ప్రత్యేకాధికారి డాక్టర్ రంగనాథ్ బాబు ప్రజలు, మహిళలకు యోగా నిర్వహించారు. చిప్పగిరి సర్పంచి దాసరి గోవిందరాజులు, మాజీ జడ్‌పిటిసి మీనాక్షి నాయుడు, ఎంపిటిసి రజిని, ఎంపిడిఒ అల్లా బకాష్, తహశీల్దార్ ఇజాజ్ అహ్మద్, ఎస్ఐ ఎపి.శ్రీనివాసులు పాల్గొన్నారు. అలాగే నేమకల్లులో డిప్యూటీ ఎంపిడిఒ బాలన్న, బెల్డోనాలో పంచాయతీ కార్యదర్శులు, సర్పంచి కరివేముల సావిత్రి ఆధ్వర్యంలో యోగా నిర్వహించారు. అనంతరం పంచాయతీ కార్యదర్శి ప్రమీల ఆధ్వర్యంలో స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్రపై అవగాహన కల్పిస్తూ.. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మహిళలకు, ప్రజలకు తెలుపుతూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం చిప్పగిరిలోని సచివాలయం దగ్గర మొక్కలు నాటారు. టిడిపి సీనియర్ నాయకులు కొండ గోవిందప్ప, జనార్ధన స్వామి, బోగేష్, అమరేష్, మాజీ ఎంపిటిసి నరసింహులు, జనసేన కన్వీనర్ చిరంజీవి, ఎంఇఒ సావిత్రమ్మ పాల్గొన్నారు. **కౌతాళం** మండలం గోతులదొడ్డి ప్రభుత్వ పాఠశాల మైదానంలో నిర్వహించిన యోగా కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు ఉల్లిగయ్య పాల్గొన్నారు. అలాగే మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో యోగా నిర్వహించారు. స్థానిక ప్రతిభ హైస్కూల్‌లో కరస్పాండెంట్ సయ్యద్ దూద్ బాష, సెక్రటరీ మైనుద్దీన్ ఆధ్వర్యంలో విద్యార్థులు యోగాలో పాల్గొన్నారు.



ఆదోనిలో యోగాసనాలు వేస్తున్న సబ్ కలెక్టర్, మున్సిపల్ కమిషనర్



ఎమ్మిగనూరులో ఎమ్మెల్యే బీవీ



కౌతాళంలో యోగాలో పాల్గొన్న విద్యార్థులు



మంత్రాలయంలో యోగా చేస్తున్న అధికారులు



చిప్పగిరిలో మొక్కలు నాటుతున్న అధికారులు



మొక్కలకు నీరు పోస్తున్న అధికారులు

## మొక్కల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

**- ఎంపిడిఒ నూర్జహాన్**

**ప్రజాశక్తి - మంత్రాలయం**

మొక్కల సంరక్షణను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని ఎంపిడిఒ నూర్జహాన్ కోరారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం దగ్గర స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా మొక్కలకు నీరు పోశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. మొక్కలు నాటి వాటిని సంరక్షించడం వల్ల వాతావరణం కాలుష్యం కాకుండా ఉంటుందని తెలిపారు. వర్షాలు సకాలంలో కురిసి పాడి పంటలకు నెలవు అవుతుందని చెప్పారు. పంచాయతీ కార్యదర్శులు ఉపేంద్ర రెడ్డి, ఇస్రత్ బాష పాల్గొన్నారు.

## ఎస్ఐ మారుతి బాధ్యతల స్వీకరణ

**ప్రజాశక్తి - హాలహర్వి**

హాలహర్వి ఎస్ఐగా ఈ.మారుతి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తామని తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలు, జూదం, అక్రమ మద్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. పోలీసు సిబ్బంది నూతన ఎస్ఐకి శుభాకాంక్షలు తెలిపారు. ఇక్కడ పనిచేస్తున్న చంద్ర కర్నూలు మూడో పట్టణ పోలీసు స్టేషన్‌కు బదిలీపై వెళ్లారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్ఐ

## ఆదోనిలో వైసిపి జెండా కట్టా ధ్వంసం

**- పోలీసులకు నాయకుల ఫిర్యాదు**

**ప్రజాశక్తి - ఆదోని**

పట్టణంలోని 9వ వార్డు విజయనగర్ కాలనీలో ఉన్న వైసిపి జెండా కట్టను దుండగులు ధ్వంసం చేశారు. పార్టీ జెండాను విరచడం, బురద పూశారు. దుండగులపై చర్యలు తీసుకోవాలని శనివారం మూడో పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు మున్సిపల్ వైస్ ఛైర్మన్ నరసింహులు, పట్టణ అధ్యక్షులు దేవా తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఆదోనిలో ఘర్షణలు జరగకూడదని ఎమ్మెల్యే పార్థసారథి చాలా సందర్భాల్లో చెప్పారని అన్నారు. పార్టీ జెండాను ఇలా అవమానపరిచే విధంగా దుండగులు వ్యవహరిస్తున్న తీరును ఏ విధంగా చూడాలని, వారిని కఠినంగా శిక్షించి పార్టీల మధ్య చిచ్చు పెడుతున్న అసాంఘిక శక్తులను అణచివేసే విధంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటన పునరావృతం కాకుండా అన్ని పార్టీలూ చూడాలని కోరారు. ఆదోనిలో వైసిపి బలంగా ఉందని, ఏ రకంగానైనా ఆ పార్టీని భయభ్రాంతులకు గురి చేయాలనే ఇలాంటి సంఘటనలకు పాల్పడుతున్నారని విమర్శించారు. టౌన్ వైస్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి గంగాధర్, టౌన్ సెక్రటరీ తాయన్న, టౌన్ ఎస్సీ సెల్ అధ్యక్షులు ఏసోబు, అశోక్, ప్రసాద్, బుడేకల్ బాబు, కిశోర్, టౌన్ కార్యదర్శి బాబా నరసన్న, వీరాంజి, కౌన్సిలర్ రఘునాథ్ రెడ్డి, దినేష్, ఉస్మాన్, ఫయాజ్, కౌన్సిలర్ అశోక్, హరి, రవి ఆచారి, చిన్న రామకృష్ణారెడ్డి, తారనాథ్, భీమా, వీరప్ప, నారాయణ, హరిశ్చంద్ర, కౌన్సిలర్ చలపతి, అశోక్ ఉన్నారు.





పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న నాయకులు

# కులసంఘాల రాజకీయ రంగు..!

**- దళితుల మధ్య చిచ్చుకు ఆజ్యం - పావులు కదుపుతున్న ఎమ్మెల్యే..?**

**ప్రజాశక్తి - ఆదోని**

ఆదోని నియోజకవర్గంలో దళితుల మధ్య అగాధం పెరిగింది. కుల సంఘాలకు రాజకీయ రంగు పులిమి మరింత వైరి పెరిగేలా ఎమ్మెల్యే పార్థసారథి పావులు కదుపుతున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. రాజకీయంగా, ప్రభుత్వపరంగా లబ్ధి చేకూరుస్తామని ఆశలు చూపి తనపై పడ్డ కుల వివక్షత మచ్చను చెరుపుకునేందుకు దళితుల చేత మరో గ్రూపుపై నిందలు వేసే ప్రక్రియ మొదలు పెట్టినట్లు సమాచారం. ఎన్నికల సమయంలో మినహా మిగతా వేళల్లో దళితులు ఐక్యంగా ఉండేవారు. ప్రస్తుతం వారి మధ్య వైరి మొదలైంది. ఆదోని మండలం ఢణాపురం గ్రామంలో ఈనెల 16న జరిగిన గ్రామ సభలో సర్పంచి చంద్రశేఖర్ పట్ల వివక్ష ప్రదర్శించారని ఎమ్మెల్యే పార్థసారథిపై దళిత, ప్రజాసంఘాల నాయకులు ఫైర్ అయ్యారు. బీసీ ఎమ్మెల్యేగా ఉండి సొంత పార్టీ సర్పంచిపైనే వివక్ష చూపడం పట్ల ఆదోనిలో దళిత సంఘాల నాయకులు సమిష్టి ఉద్యమానికి పావులు కదుపుతున్నారు. శనివారం పట్టణంలోని భీమాస్ హోటల్‌లో దళిత, ప్రజా సంఘాల నాయకులు సమావేశం నిర్వహించారు. కుల వివక్ష ప్రదర్శించిన ఎమ్మెల్యేపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని శుక్రవారం దళిత సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఇస్వి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం రసీదు ఇవ్వాలని పోలీసుల నుంచి రసీదు కూడా పొందారు. దళిత, ప్రజా సంఘాల నాయకులు చేపట్టిన నిరసన విజయవంతమైందని నాయకులు చెబుతున్నారు. దీనిని వ్యతిరేకిస్తూ కూటమి దళిత నాయకులు ఒకరిపై ఒకరు నిందారోపణలు చేసుకుంటూ సోషల్ మీడియా వేదికగా విమర్శలు చేసుకున్నారు. ఐక్యంగా ఉండే దళితుల మధ్య ఎమ్మెల్యే పార్థసారథి వైరికి ఆజ్యం పోస్తున్నారని, మంచి పద్ధతి కాదని నాయకులు చెబుతున్నారు. బీసీ వర్గాలను రెచ్చగొడుతూ అనుకూలంగా ఉండే ఎస్సీ వర్గాలను తమపైకి ఉసిగొలిపి సోషల్ మీడియా వేదికగా విమర్శలు చేస్తున్నారని, ఇలా వ్యవహరిస్తే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని దళిత, ప్రజాసంఘాల నాయకులు హెచ్చరిస్తున్నారు. కుల వివక్ష ప్రదర్శనకు క్షమాపణ పైపైన చెప్పినా, లోపల దళితుల పట్ల పార్థసారథికి చిన్న చూపే ఉందని ప్రస్తుతం వ్యవహారం బట్టి చూస్తే తెలుస్తోందని దళిత, ప్రజా సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఎమ్మెల్యే పార్థసారథి, టిడిపి నాయకులు గుడిసె కృష్ణమ్మపై కేసు నమోదయ్యే వరకు ఐక్యంగా ఉద్యమిస్తామని దళిత సంఘాల నాయకులు వీరేష్, సాయిరాం, విజయ్, దేవదాసు తెలిపారు. తన పట్ల కులవివక్ష చూపారని పోలీసులకు ఫిర్యాదు చేశామని, సంబంధిత వ్యక్తులపై ఎఫ్ఐఆర్ చేయాలని, తనకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని బాధితుడు ఢణాపురం సర్పంచి చంద్రశేఖర్ మీడియాతో తెలిపారు.

## సంక్షేమ పథకాలు అమలు చేయాలి

**- 23న చలో కలెక్టరేట్‌ను జయప్రదం చేయండి : సిఐటియు**

**ప్రజాశక్తి - ఎమ్మిగనూరు**

అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్‌కు సంక్షేమ పథకాలు అమలు చేయాలని ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా సహాయ కార్యదర్శి బి.గోవర్ధనమ్మ, అర్బన్ కార్యదర్శి ఎస్.నాగలక్ష్మి, రూరల్ కార్యదర్శి కె.శైలజ, సిఐటియు మండల అధ్యక్ష, కార్యదర్శులు పి.గోవిందు, బి.రాముడు కోరారు. శనివారం సిడిపిఒకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అంగన్వాడీలకు తల్లికి వందనం పథకాన్ని అమలు చేయడం లేదని తెలిపారు. రేషన్ కార్డులు, ఇంటి స్థలాలు, పింఛన్లు ఇవ్వడం లేదని చెప్పారు. ఈ సమస్యలపై ఈనెల 23న చలో కలెక్టరేట్ ధర్నాకు కదలి రావాలని కోరారు. సిఐటియు నాయకులు రవికుమార్, మోహిన్ పాల్గొన్నారు.



సిడిపిఒకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

## పాఠశాలలు నిబంధనలు పాటించాలి

**- ఎస్ఐ శ్రీనివాసులు**

**ప్రజాశక్తి - చిప్పగిరి**

ప్రయివేట్ పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలు పాటించాలని ఎస్ఐ ఎపి.శ్రీనివాసులు తెలిపారు. శనివారం చిప్పగిరి, గుంతకల్ మధ్యలో పాఠశాలల విద్యార్థులను తీసుకెళ్లే ప్రయివేట్ బస్సులను ఎస్ఐ తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బస్సుల్లో సీట్ల వరకే విద్యార్థులు ఉండాలన్నారు. సీట్లకు మించి విద్యార్థులను తీసుకెళ్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ముఖ్యంగా బస్సుల్లో కండిషన్ తప్పనిసరిగా ఉండాలన్నారు. డ్రైవర్లు అనుభవం ఉన్నవారు, లైసెన్సు కలిగిన వారై ఉండాలని తెలిపారు. కాలం చెల్లిన బస్సులు నడిపితే బస్సులను సీజ్ చేస్తామని చెప్పారు.

**జూదరుల అరెస్టు :** మండలంలోని నేమకల్లు గ్రామంలోని ఊరి బయట గల కోట వద్ద ఉన్న బహిరంగ ప్రదేశంలో పేకాట ఆడుతున్న 12 మందిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. వారి వద్ద రూ.21,250, 9 సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకొని ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు చెప్పారు.



విద్యార్థుల బస్సును తనిఖీ చేస్తున్న ఎస్ఐ

## తప్పుడు కేసులు తగదు : ఎస్‌డిపిఐ

**ప్రజాశక్తి - ఆదోని**

ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రశ్నించే వారిపై తప్పుడు కేసులు బనాయించి భయభ్రాంతులకు గురి చేయడం తగదని ఎస్‌డిపిఐ నియోజకవర్గం కో కన్వీనర్ సద్దాం హుస్సేన్ తెలిపారు. ఎస్‌డిపిఐ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శనివారం పట్టణంలో జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల రాజకీయ భాగస్వామ్యం కోసమే గత 16 ఏళ్ల క్రితం ఎస్‌డిపిఐ ఆవిర్భవించిందని తెలిపారు. దేశంలో అన్ని చోట్లా నాయకులు, కార్యకర్తలు ఉన్నారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను సర్పంచి, ఎంపిటిసి, కౌన్సిలర్లు, ఎమ్మెల్యేను చేయడమే లక్ష్యమని తెలిపారు. సీనియర్ నాయకులు నాసిర్ మాట్లాడుతూ... ఎస్‌డిపిఐ జాతీయ నాయకులు ఎంకె.ఫయాజ్‌ను తప్పుడు కేసుల్లో అరెస్టు చేయడం దారుణమన్నారు. త్వరలో ఆయనను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో పోటీ చేయడానికి సిద్ధంగా ఉండాలని కార్యకర్తలను కోరారు.





## 'మద్యం అక్రమ రవాణాపై నిఘా'

**ప్రజాశక్తి - ఆదోని**

కర్ణాటక ప్రాంతం నుంచి అక్రమంగా మద్యాన్ని రవాణా చేస్తున్న వారిపై ప్రత్యేక నిఘా ఉంచి కట్టడికి చర్యలు తీసుకుంటున్నామని ప్రొహిబిషన్, ఎక్సైజ్ సిఐ సైదులు తెలిపారు. వాహనాల తనిఖీల్లో లభ్యమైన మద్యాన్ని శనివారం ఆదోని ఎక్సైజ్ స్టేషన్‌లో మీడియా ముందు ఉంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సమాచారం మేరకు కౌతాళం మండలం కాత్రికి, పొదలకుంట గ్రామాల మధ్య వాహనాల తనిఖీ నిర్వహించినట్లు తెలిపారు. తనిఖీల్లో కర్ణాటక మద్యం రవాణా చేస్తున్న పొదలకుంట గ్రామ వాసి లక్కీ శివ వద్ద 12 కర్ణాటక మద్యం బాక్సులు (1,152 టెట్రా ప్యాకెట్లు) స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీటి విలువ సుమారు రూ.60 వేలు ఉంటుందన్నారు. రవాణాకు ఉపయోగించిన ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి అరెస్టు చేశామని తెలిపారు.

# ఘనంగా బుట్టా రేణుక పుట్టినరోజు వేడుకలు

**- శ్రీనీలకంఠేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు**

**ప్రజాశక్తి ఎమ్మిగనూరు**

మాజీ ఎంపీ, వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ బుట్టా రేణుక పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. శనివారం వైసిపి పట్టణ అధ్యక్షులు కామర్తి నాగేశప్ప ఆధ్వర్యంలో శ్రీనీలకంఠేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మున్సిపల్ వైస్ ఛైర్మన్, నియోజకవర్గ యువజన అధ్యక్షులు డి.నజీర్ అహ్మద్, జిల్లా చేనేత విభాగం అధ్యక్షులు ఎంకె.శివప్రసాద్, జిల్లా అధికార ప్రతినిధి కదిరికోట సునీల్ కుమార్, పట్టణ ఉపాధ్యక్షులు బజారి రెడ్డి, 22వ వార్డు కౌన్సిలర్ డిష్ కేశవరెడ్డి, పట్టణ సీనియర్ నాయకులు పాల శ్రీనివాస్ రెడ్డి, పట్టణ యువ నాయకులు వెంకటాపురం రాజు, పట్టణ ప్రధాన కార్యదర్శి కరే రాము, పట్టణ కార్యదర్శులు జెరూబండి రఘువీర, కోట గణేష్, పట్టణ కార్యవర్గ సభ్యులు చంద్రశేఖర్, బుట్టా ఈరన్న, నాయకులు కనికె నాగరాజు, మహేష్ పాల్గొన్నారు. అలాగే వైసిపి జిల్లా అధికార ప్రతినిధి కె.సునీల్ కుమార్ ఆధ్వర్యంలో పట్టణ పరిసర ప్రాంతాల్లో నివసించే నిరాశ్రయులకు దుప్పట్లు పంపిణీ చేశారు. పాల శ్రీనివాసరెడ్డి, మహబూబ్ బేగ్, ఎల్ఐసి ప్రభాకర్, పల్లవి రాజశేఖర్ పాల్గొన్నారు. అలాగే వైసిపి పట్టణ అధ్యక్షులు కె.నాగేశప్ప నేతృత్వంలో వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మున్సిపల్ ఛైర్మన్ డాక్టర్ రఘు, రాష్ట్ర సాంస్కృతిక విభాగ ప్రధాన కార్యదర్శి రాజారత్నం, రాష్ట్ర చేనేత విభాగ ప్రధాన కార్యదర్శి మాచాని వెంకటేష్ హాజరయ్యారు. **నందవరంలో** వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ బుట్టా రేణుక పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. వైసిపి మండల నాయకులు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. బస్టాండ్ ప్రాంతంలో భారీ కేక్ కట్ చేసి, మిఠాయిలు పంచుకుంటూ సంబరాలు చేసుకున్నారు. వైసిపి మండల నాయకులు శివారెడ్డి గౌడ్, విరుపాక్షి రెడ్డి మాట్లాడుతూ... సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో ప్రజల హృదయాల్లో నిలిచిన రేణుక వైసిపి అధినేత జగన్మోహన్ రెడ్డి అండదండలతో బలోపేతం కావాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో మరిన్నీ ఉన్నత పదవులు అందుకోవాలని కోరారు. జడ్‌పిటిసి నిఖిల్ చక్రవర్తి, పేట శ్రీనివాసరెడ్డి, రాంకోటి రెడ్డి, సురేష్ గౌడ్, రాజేష్ శెట్టి, కోటేశ్వర రావు, డీలర్ రాముడు పాల్గొన్నారు. **గోనెగండ్లలో** బుట్టా రేణుక పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. వైసిపి మండల కన్వీనర్ కెవి.కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో వైసిపి కార్యాలయం వద్ద కేక్ కట్ చేసి మిఠాయిలు పంచుకున్నారు. వైసిపి నాయకులు కాశిరెడ్డి, బీసీ సెల్ నాయకులు టి.మురళీ నాయుడు, మార్కెట్ యార్డు మాజీ వైస్ ఛైర్మన్ ఎస్‌బి.మన్సూర్, వైస్ ఎంపిపి అల్వాల వెంకటరామిరెడ్డి, చికెన్ రాజా, మాజీ కన్వీనర్ దొరబాబు నాయుడు, పెద్దమరివీడు నరసన్న ఆచారి, యూత్ అధ్యక్షులు టి.ఇమ్రాన్ పాల్గొన్నారు.



ఎమ్మిగనూరులో పూజలు చేస్తున్న నాయకులు



నందవరంలో కేక్ కట్ చేస్తున్న నాయకులు



గోనెగండ్లలో కేక్ కట్ చేస్తున్న నాయకులు